
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 14 మే 2025



పిజిఆర్ఎస్‌తో సమస్యల సత్వర పరిష్కారం

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి - ముసునూరు

పిజిఆర్ఎస్ సర్వే ద్వారా వెంటనే పరిష్కారం చూపాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రమణతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా రైతులకు, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాలు ఏయే గ్రామాల్లో ఏ పరిధిలో ఎలా ఉన్నాయో రిపోర్ట్ నివేదిక అందించాలన్నారు. మల్టీ పర్పస్ గోడౌన్స్‌ను ముసునూరు, గోపవరం, చెక్కపల్లి, చింతలవల్లి, కొర్లకుంట గ్రామాల్లో సచివాలయ సర్వే సిబ్బందితో కలిసి పరిశీలించారు. మండల శాఖ అధికారులు కాంట్రాక్టుదారులతో మాట్లాడి మధ్యలో ఆగిపోయిన గోడౌన్స్ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

చంద్రన్న బీమా ఇచ్చేదుందా..!

ఏడాది పూర్తవుతున్నా అతీగతీ లేని పథకం అమలు

ఎన్నో కుటుంబాలు ఇంటి పెద్దదిక్కును కోల్పోయి అవస్థలు

రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేలకుపైగా బాధిత కుటుంబాల ఎదురుచూపు

ప్రమాద బీమా రూ.పది లక్షలు, సాధారణ మరణాలకు రూ.5 లక్షలు ఇస్తామని హామీ

కూటమి ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం హామీల అమలులో తీవ్ర నిర్లిప్తత ప్రదర్శిస్తూ విమర్శలు ఎదుర్కొంటుంది. అధికారంలోకొచ్చి ఏడాది గడిచిపోతున్నా ప్రజలకు అత్యంత అవసరమైన పథకాలను సైతం అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమవుతుందనే చర్చ జనాల్లో పెద్దఎత్తున సాగుతోంది. పేదలకు అత్యంత అవసరమైన పథకాల్లో చంద్రన్న బీమా ఒకటి. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో ఈ పథకం అమల్లోకి వచ్చింది. తర్వాత వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా పేరుతో ఈ పథకాన్ని కొనసాగించింది. కుటుంబ పెద్ద చనిపోతే ఆ కుటుంబానికి రక్షగా ఉండేందుకు ఈ బీమా పథకాన్ని తీసుకొచ్చారు. 50 ఏళ్లలోపు ఉన్న ఇంటిపెద్ద సాధారణంగా మృతి చెందితే రూ.లక్ష, ప్రమాదంలో మరణిస్తే రూ.ఐదు లక్షలు చొప్పున వైసిపి ప్రభుత్వంలో అందించేవారు. తాము అధికారంలోకి వస్తే చంద్రన్న బీమా పథకం అమలు చేస్తామని, సాధారణ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణానికి రూ.పది లక్షలు ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో పెట్టింది. కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు బీమా అండగా ఉంటుందని అంతా భావించారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా పథకం మాత్రం అమలు చేయలేదు. దీంతో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన వేలాది కుటుంబాలు చంద్రన్న బీమా ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్నాయి. ఆర్థిక చేయూత లేక ఆ కుటుంబంలోని పిల్లలు చదువు వదిలేసి కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పేదలకు ఆర్థిక అండగా నిలిచే బీమా పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రన్న బీమా ఇచ్చేదుందా అంటూ అంతా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.



వేలాది కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఏడాదికి దాదాపుగా మూడు వేలకుపైగా మరణాలు బీమా పరిధిలోకి వస్తున్నాయి. గత ప్రభుత్వంలో బీమా సొమ్ము అందించిన వివరాలను పరిశీలిస్తే ఇది తేటతెల్లమవుతోంది. 2021-22లో ఏలూరు జిల్లాలో సాధారణ మరణాలు 1,692, ప్రమాద మరణాలు 215 ఉన్నాయి. వైఎస్ఆర్ బీమా కింద 1,550 కుటుంబాలకు సొమ్ములు అందాయి. 2022-23లో సాధారణ మరణాలు 1,467 ఉండగా, ప్రమాద మృతులు 181గా నమోదయ్యాయి. 1,610 కుటుంబాలు బీమా సొమ్ము అందుకున్నాయి. 2023-24లో సాధారణ మరణాలు 1,492 ఉండగా, ప్రమాద మరణాలు 196 ఉన్నాయి. బీమా సొమ్ము అందుకున్న కుటుంబాలు 1,149 ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కల ప్రకారం చూస్తే రెండు జిల్లాల్లో దాదాపుగా బీమా అందుకున్న కుటుంబాలు ఏడాదికి మూడు వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. నెలకు 250 మంది వరకూ సాధారణ, ప్రమాద మరణాలు నమోదువుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 2024 మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత బీమా సొమ్ము బాధిత కుటుంబాలకు అందలేదు. 14 నెలలుగా బీమా సొమ్ము ఏఒక్క కుటుంబానికీ అందని పరిస్థితి. దాదాపుగా మూడు వేలకు పైగా బాధిత కుటుంబాలు చంద్రన్న బీమాకోసం ఎదురుచూస్తున్నాయి.

చంద్రన్న బీమాకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎటువంటి విధివిధానాలు విడుదల చేయలేదు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం కుటుంబంలోని 18 ఏళ్లు దాటిన వారు ఎవరు మరణించినా చంద్రన్న బీమా వర్తించేలా నిబంధనలు ఉండేవి. వైసిపి ప్రభుత్వం రేషన్‌కార్డులో ఉన్న ఇంటిపెద్దను మాత్రమే వైఎస్ఆర్ బీమా పరిధిలోకి తెస్తూ నిబంధనలు మార్చింది. అంతేకాకుండా బీమా సొమ్ము సైతం వైసిపి ప్రభుత్వం తగ్గించింది. కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా ఏవిధంగా అమలు చేయనుందో ఇప్పటి వరకూ విధివిధానాలు ప్రకటించలేదు. ఇంటి పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబీకులు చంద్రన్న బీమా కోసం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతూ అలసిపోతున్న పరిస్థితి ఉంది. బీమా సొమ్ము అందిస్తే ఎన్నో పేద కుటుంబాలకు ఊరట కలగనుంది. ప్రభుత్వం వెంటనే చంద్రన్న బీమా అమలు చేయాలని జనం కోరుతున్నారు.

జాబ్ కార్డున్న ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు చూపాలి

వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

రూ.25 లక్షలతో సానిగూడెంలో చేపట్టిన క్రొత్త చెరువు తవ్వకం పనులను పరిశీలించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - దెందులూరు

జాబ్‌కార్డులు పొందిన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు చూపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. దెందులూరు మండలం సానిగూడెంలో రూ.25 లక్షల వ్యయంతో సాగునీటి అవసరాలకు ఉపయోగపడే 68 ఎకరాల కొత్త చెరువు తవ్వకం పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, మజ్జిగ వంటివి అందించాలని, ఎండదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉదయం 6 గంటలకే పనులు ప్రారంభించి 10 గంటల్లోపు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి బాట పట్టాలని, గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి హామీ ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ప్రజల వలసలను నివారించొచ్చన్నారు. 130 మంది ఉపాధి హామీ కూలీలతో చేపట్టిన పనుల్లో మంగళవారం ఎంతమంది పనికి వచ్చారనేది మస్తరు షీటును పరిశీలించి, నలుగురు ఎందుకు గైర్హాజరయ్యారని కలెక్టర్ అధికారులను ప్రశ్నించగా పామాయిల్ కోత పనికి వెళ్లారని బదులిచ్చారు. అక్కడ రోజుకి ఎంత కూలి వస్తుందని జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. అక్కడ రూ.500 ఇస్తారని బదులిచ్చారు. అక్కడ రోజంతా పని చేస్తే రూ.500 మాత్రమే ఇస్తారని, ఇక్కడ కేవలం నాలుగు గంటలు పని చేస్తే రూ.290 ఇస్తున్నామని, మరో 10 నిమిషాలు పని సమయం పెంచితే రూ.307 చొప్పున అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. పనులకు ఇబ్బందేమైనా ఉందా, సమస్యలు ఉంటే తెలియజేయాలని, పనికి హాజరు కానివారికి మస్తరు వేసి డబ్బులు జమ చేస్తున్నారా, డబ్బులు సకాలంలో జమవుతున్నాయా, ఉపాధి హామీ పనులు లేనప్పుడు వ్యవసాయ పనులకు వెళ్తారా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అందరికీ చల్లని తాగునీరు అందిస్తున్నారా అడగ్గా నాలుగు టిన్నులు సిద్ధంగా ఉన్నాయని చెప్పగా ఇవి సరిపోతాయా అని అడగ్గా అవసరమైతే మళ్లీ తెప్పిస్తున్నారని చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రథమ చికిత్స కిట్‌ను పరిశీలించి వాటిలో ఏయే మందులు ఉన్నాయానేది ఆమె స్వయంగా పరిశీలించారు. వేసవి దృష్ట్యా భోజనం, అల్పాహారం తినేందుకు వేసిన చలువ పందిర్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పనులు వేగవంతంగా చేసేందుకు అవకాశం ఉందన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. జాబ్‌కార్డు పొందిన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని, నిర్ణీత సమయంలోగా వారి ఖాతాలకు డబ్బులు జమచేసి వారికి తెలియజేయాలని డ్వామా అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, డ్వామా పీడీ కెవి.సుబ్బారావు, తహశీల్దారు బి.సుమతి, ఎంపిడిఒ కె.శ్రీదేవి, ఎపిఒ పి.ఫాతిమా, గ్రామ సర్పంచి సన్నిపల్లి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్, మాజీ గ్రామ సర్పంచి యలమర్తి శ్రీనుబాబు, గ్రామ సచివాలయం, జాతీయ ఉపాధి హామీ టెక్నికల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ నాయకులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

దళితుల భూములను వారికే కేటాయించాలి

ఆక్రమించుకున్న పెత్తందార్లపై చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

దళితుల భూములను ఆక్రమించుకున్న పెత్తందార్లపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, 9/77 అసైన్డ్ చట్టప్రకారం దళితుల భూములను వారికే కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో ఇటీవల ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చిన్నాగిరిపల్లి దళితులు భూస్వాధీన ఉద్యమం ద్వారా బాగు చేసుకుంటున్న భూములను ఆయన భూపోరాట కమిటీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో రవి మాట్లాడుతూ కష్టజీవులకు ఎలప్పుడూ ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. ఈ భూ పోరాటానికి సిపిఎం పూర్తి సంఘీభావం తెలుపుతుందన్నారు. తోటపల్లి రెవెన్యూ గ్రామంలోని సుమారు 40 ఎకరాలను భూస్వాములు, పెత్తందార్లు ఆక్రమించుకుని పేద దళితులపై దౌర్జన్యానికి పాల్పడుతుంటే సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసైన్డ్ చట్టప్రకారం ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన భూములను ఎవరూ కొనుగోలు చేసినా అవి పేదలకే చెందుతాయన్నారు. దళితులతో కలిసి సదరు భూముల్లో బాగుచేతలో భాగంగా ఆయన గొడ్డలి చేతబట్టి ముళ్లకంపలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, నేతలు సత్తు కోటేశ్వరరావు, ఎం.నరేష్, భూపోరాట కమిటీ సభ్యులు జె.రంగారావు, టి.కుమారి, జె.వాణి, అరుణ, టి.అర్జునరావు, జె.సుబ్బారావు, బి.రామ్మోహనరావు, సూర్జీత్ పాల్గొన్నారు



ముళ్లకంపలు తొలగిస్తున్న సిపిఎం జిలా కార్యదర్శి రవి, నేతలు

సిహెచ్‌ఒల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

సమస్యల పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి సమ్మె విరమణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆరు సంవత్సరాలు సర్వీసు పూర్తయిన ప్రతి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. జీతం, ఇన్సెంటివ్స్ కలిపి ప్రతినెలా మొదటి వారంలోనే ఇవ్వాలన్నారు. ఫిక్స్‌డ్ పే అమలు చేయాలని, ఎనిమిది నెలల పెండింగ్ ఇన్సెంటివ్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన వారికి మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయం కింద రూ.20 వేలు ఇవ్వాలన్నారు. ఇపిఎఫ్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. సిహెచ్‌ఒ, ఎంఎల్‌హెచ్‌పిల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తుతానని గోపీమూర్తి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజలకు అవగాహన కోసమే మాక్‌డ్రిల్

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయం నుండి తప్పించుకునేలా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన 'మాక్‌డ్రిల్' అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. అత్యవసర, విపత్తు సమయాల్లో ప్రజలు ఎలాంటి ఆందోళనకూ గురికాకుండా విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇటువంటి మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాకినాడ నుండి వచ్చిన కేంద్ర విపత్తు నివారణ దళానికి చెందిన 25 మంది సభ్యులు ఈ మాక్‌డ్రిల్ నిర్వహణలో సహకరించారన్నారు. జిల్లాలో తుపాన్లు, వరదలు వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 149 అంబులెన్స్‌లు, నాలుగు వేల మంది పారా మెడికల్ సిబ్బంది, 475 మంది ఎన్‌సిసి వాలంటీర్లు, 8 ఫైర్ ఇంజన్లు, 40 అగ్నిమాపక పరికరాలతోపాటు పోలీసు, రెవెన్యూ, ఫైర్, రాష్ట్ర విపత్తు నివారణ సిబ్బంది ఉన్నారన్నారు. వీరందరితో మండలాల్లో 'మాక్‌డ్రిల్స్' నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

తొలుత కలెక్టరేట్‌లో అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ఎదుర్కొనేందుకు ఉద్యోగులు, ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు సంబంధిత శాఖలు మాక్ డ్రిల్స్ నిర్వహించాయి. అగ్నిమాపక సేవలు, ఎస్‌డిఆర్ఎఫ్, పోలీసులు, వైద్యఆరోగ్యశాఖ, శిక్షణ పొందిన ఆపదమిత్ర వాలంటీర్లు, ఎన్‌సిసి, విద్యుత్ శాఖ తదితర బహుళ విభాగాలు మాక్‌డ్రిల్స్‌లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, జిల్లా ఫైరాఫీసర్ సిహెచ్.రత్నబాబు, త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావు, ఎపిఇపిడిఎసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకర్, బిసి కార్పొరేషన్ ఇడి ఆర్‌వి.నాగరాణి, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, తహశీల్దార్ జి.శేషగిరి, కలెక్టరేట్ సిబ్బంది, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

జిఒ 3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్ తేవాలి

ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీలో జిఒ-3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్ తెచ్చి ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలని, అప్పటివరకు ఏజెన్సీలో డిఎస్‌సి రిక్రూట్‌మెంట్ వాయిదా వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే అంశంపై సిఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో మూడు ఆప్షన్స్ పరిశీలనకు వచ్చినట్లు వస్తున్న వార్తలను ఉద్దేశించి ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. కేవలం ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్ కల్పించడం తప్ప మరో ఆప్షన్ లేదని పేర్కొన్నారు. మిగతా ఇతర ఏ ఆప్షన్ తీసుకున్నా అది గిరిజన నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా, ఇటీవల అరకు వచ్చిన సందర్భంగా జిఒ నెంబర్ 3ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. అందుకు అనుకూలంగా సాంకేతిక లోపాలను సవరించి తిరిగి న్యాయ వివాదానికి చోటు లేని విధంగా పాత జిఒ స్థానంలో కొత్త ఆర్డినేషన్ తీసుకురావాలని తెలిపారు. దరఖాస్తు గడువు ఈ నెల 15తో ముగియనున్నందున ఈ సమస్యను అత్యవసరంగా భావించి చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీలో అప్పటిదాకా డిఎస్‌సి వాయిదా వేసి తదుపరి ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సమస్యపై ఏజెన్సీలో ఆందోళనలతో పాటు బంద్ కూడా నిర్వహించామని, ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులకు తగువిధంగా న్యాయం జరిగని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఆర్‌డిఎస్ఎస్. లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి

1912 టోల్ ఫ్రీకు అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో మంగళవారం జిల్లా విద్యుత్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పునరుద్దరించబడు పంపిణీ రంగ పథకం (ఆర్‌డిఎస్-ఎస్) కింద వ్యవసాయ, వ్యవసాయేతర ఫీడర్ల విభజన, ఓవర్ లోడ్ ఫీడర్ల విభజన, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తదితర అంశాలపై విద్యుత్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డిఎస్ఎస్ నిధులు రూ.176 కోట్లతో వ్యవసాయ ఫీడర్ల నుండి వ్యవసాయేతర సర్వీసులను వేరుచేసే ఫీడర్ల విభజన కార్యక్రమాలు, అదే విధంగా రూ.66.51 కోట్లతో ఓవర్ లోడ్ ఫీడర్ల విభజన పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేసేలా నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. హెచ్‌టి, ఎల్‌టి, వ్యవసాయ సర్వీసులు, అధిక సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు, ఫీడర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను కూడా నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సమస్యలపై 1912 టోల్‌ఫ్రీకి అందే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో చేపట్టిన 11 సబ్ స్టేషన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, ఇఇలు రాధాకృష్ణ, అంబేద్కర్, శశిధర్, ఖాన్, డిఇలు, ఎడిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో అధికారుల పర్యటన

కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్న వైనం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని సూరేపల్లి, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, చింతలవల్లి, ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో మండల శాఖ అధికారులు మంగళవారం పర్యటించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాశక్తి వార్తకు కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించారు. నాలుగు వారాలుగా కూలీలకు వేతనాలు అందడంలేదని, పని ప్రదేశంలో తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు లేవని, కొందరికి పని చూపించి మరి కొందరికి చూపించడం లేదని ఇలా పలు రకాల సమస్యలను సిపిఎం బృందం వద్ద ఉపాధి కూలీలు ఆవేదన చెందారు. దీనిపై నాలుగు వారాలుగా వేతనేల్లేవు శీర్షికన ఈ నెల 11వ తేదీన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించారు. మండల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వారు మంగళవారం పలు గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎపిఎం టి.రోజ్ లీలా, పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో వెరిఫికేషన్‌కు వెళ్లి పని ప్రదేశాల్లో పర్యటించి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపిడిఒ

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

భూసార పరీక్షల ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించవచ్చని, రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా కోరారు. మండలంలోని వడ్లమాను రైతు సేవ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావుతో కలిసి రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జులకు సమీక్ష నిర్వహించారు. అనంతరం భూసార పరీక్షల ఫలితాల కోసం మట్టి నమూనా సేకరణ ప్రక్రియను పరిశీలించి గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు పలు సూచనలు చేశారు.


మట్టి నమూనా సేకరణను పరిశీలిస్తున్న హబీబ్‌భాషా

ఏలూరులో 'సింగిల్' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సింగిల్ సినిమాను ఇంతగా ఆదరించినందుకు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆ మూవీ హీరో శ్రీ విష్ణు తెలిపారు. ఏలూరులోని ఎస్‌విసి మాల్‌లో సింగిల్ సినిమా యూనిట్ మంగళవారం సందడి చేశారు. ముందుగా ప్రేక్షకులను కలిసి సినిమాను హిట్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. చిత్ర యూనిట్‌ను పలువురు సన్మానించారు. అనంతరం జరిగిన పత్రికా సమావేశంలో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ సింగిల్ సినిమాను ఇంతగా ఆదరించినందుకు ప్రేక్షకులకు రుణపడి ఉంటానని తెలిపారు. ఫ్యామిలీ మొత్తం కలిసి చూసే సినిమా అని ప్రతిఒక్కరూ మళ్లీ మళ్లీ చిత్రాన్ని వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్లు కేతిక శర్మ, ఇవాన, కమెడియన్ వెన్నెల కిషోర్, మూవీ డైరెక్టర్ కార్తీక్ రాజు పాల్గొన్నారు.


ఎస్‌విసి మాల్‌లో సింగిల్ మూవీ యూనిట్

సిబిఎస్‌ఇ ఫలితాల్లో కుమార్ స్కూల్ ఘనత

వరుసగా మూడోసారి వంద శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్




నిశాంత్‌ను అభినందిస్తున్న పివి.రవికుమార్

సిబిఎస్‌ఇ ఫలితాల్లో నూజివీడు కుమార్ సిబిఎస్‌ఇ స్కూల్ విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. ఆ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులు కావడంతో ఉత్సాహం ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత పివి.కుమార్ మాట్లాడుతూ గడచిన మూడేళ్లుగా సిబిఎస్‌ఇ ఫలితాల్లో వంద ఉత్తీర్ణత సాధించి హ్యాట్రిక్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దాసరి వెంకట సుబ్బారావు నిశాంత్ 500 మార్కులకు 483 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. బండ్ల రెబక్ కిరణ్‌మయి 476, గర్నెపూడి నిహారిక 476, గంగుల అనంత సాయి మణికంఠ 474, తవ్వ మోహనకృష్ణ అనిరుధ్ 471, మద్దిరాల ఉమా నందీశ్వర్ 469, చెలికాని జశ్విత లక్ష్మి 464, కోనేరు ధనుష్ నాయుడు 464, యాదల టెనీష్ 461, పామర్తి నిషిత 453, కొప్పుల జగదీష్ 451 మార్కులు సాధించినట్లు చెప్పారు. తమ విద్యాసంస్థలో చదివిన విద్యార్థులు పేరుగాంచిన విద్యాసంస్థల్లో ఇంటర్, ఇంజినీరింగ్ చదువుతున్నట్లు తెలిపారు. టాపర్‌గా నిలిచిన దాసరి వెంకట సుబ్బారావు నిశాంత్ మాట్లాడుతూ ఐఐటి తన లక్ష్యంగా పేర్కొన్నాడు. అత్యధిక మార్కులు సాధించి టాపరుగా తాను నిలిచేందుకు సహకరించిన స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేనిదన్నాడు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపాడు.

బాధిత కార్మిక కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కలిదిండి



ఆర్థిక సాయం అందిస్తున్న సంఘం నాయకులు

మండలంలోని పేట కలిదిండికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు చేబోయిన నారాయణ మృతి చెందాడు. ఆ కుటుంబానికి అండగా నిలవాలని భవన నిర్మాణ కార్మికులు తలంచారు. తొలుత దహన సంస్కారాలకు రూ.పది వేలు కుటుంబ సభ్యులకు అందించారు. సంఘం పరంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) నాయకులు అబ్దుల్ అక్బర్ భాషా, పోతురాజు బాలాజీ, సానబోయిన సత్యనారాయణ, పరసా రాజేష్, కటికల వెంకట శ్రీనివాస్, కనక లింగేశ్వరరావు, చిన వెంకటరత్నం పాల్గొన్నారు.

మహాకాళేశ్వరానికి పుష్కర ప్రత్యేక బస్సు

జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

12 ఏళ్లకు ఒకసారి వచ్చే సరస్వతి నది పుష్కరాలకు ఏలూరు నుంచి మహాకాళేశ్వరానికి పుష్కర స్పెషల్ బస్సు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బస్సు ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఏలూరు బస్టాండ్ నుంచి బయలుదేరి ఖమ్మం, వరంగల్, భద్రకాళి మాత ఆలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి మాత, కొండగట్టు ఆంజనేయస్వామి మీదుగా మహా కాళేశ్వరం చేరుకుని పుష్కర స్నానం అనంతరం రామప్ప దేవాలయం దర్శనం చేసుకుని 23వ తేదీ ఆరు గంటలకు ఏలూరు చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సుకు టికెట్ ధర రూ.2200 నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యాత్రికులు వినియోగించుకోవాలని, వివరాలకు 7382903287, 9346767670 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

మండల కేంద్రమైన పోలవరం బస్ షెల్టర్ వద్ద రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జానపద కళాజాత బృందం మంగళవారం ఎయిడ్స్ నియంత్రణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాటలు, మాటల రూపకంలో ఎయిడ్స్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారులు కళా కృష్ణ, యడ్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జానపద కళాకారులు మాట్లాడుతూ జిల్లాలో 17 ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ఎయిడ్స్ పైఅవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కలెక్టర్ ఆదేశాల మేరకు కళా ప్రదర్శన ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

అధికారులకు ఎంఎల్ఎ రోషన్‌కుమార్ ఆదేశాలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజవర్గంలో రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బి ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మరమ్మతులు చేపట్టాల్సిన 36 రహదారులు గుర్తించగా 28 రహదారుల్లో పనులు పూర్తి చేశామని నాలుగు రోడ్లు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నిధులు మంజూరైన రహదారులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

నేరాలు - ఘోరాలు

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని...

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదని మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెదవేగి మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... పెదవేగి మండలంలోని అంకన్నగూడెం గ్రామానికి చెందిన పల్లెపాముల శ్రీను(34) కూలి పనులు చేసి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీను మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య చిన్నపాటి విభేదాలు తలెత్తడంతో కొన్నిరోజుల క్రితం శ్రీను భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీను మంగళవారం సాయంత్రం ఇంటి వద్దనే ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నీటి సంఘం అధ్యక్షుడు మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

రోడ్డు ప్రమాదంలో మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన మొగల్‌చెరువు నీటి సంఘం అధ్యక్షుడు చిన్నం కృష్ణ (52) మృతి చెందాడు. కృష్ణ ఈ నెల 12వ తేదీ సోమవారం చిన్నంపేట గ్రామం నుంచి కారులో అన్నవరంలో జరిగే తమ బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి వస్తూ ఉండగా మార్గమధ్యంలో భీమడోలు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనతో పాటు ప్రయాణిస్తున్న మరో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన చిన్నం కృష్ణను ఏలూరులోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కృష్ణ మృతితో చిన్నంపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని ఇంజరం పంచాయతీ బర్లమడుగు గ్రామంలో పక్కపక్కన ఉన్న రెండు తాటాకిళ్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రేసురాజులు, సోయం బుల్లెమ్మలకు చెందిన పక్కపక్కన ఉన్న రెండు తాటాకిళ్లలో మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా అదుపులోకి రాకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే రెండు ఇళ్లు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. కట్టుబట్టలతో మిగిలామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థి దశలోనే దేశభక్తి 'త్రివిధ' లక్ష్యం

విద్యాసంస్థల అధినేత సబ్బినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



పది ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న శ్రీనివాసరావు (ఫైల్)

విద్యార్థి దశలోనే ప్రతి విద్యార్థి దేశభక్తి పెంపొందించుకోవాలనే లక్ష్యంతో విద్యాసంస్థలను స్థాపించి గడిచిన 16 ఏళ్లుగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని త్రివిధ విద్యాసంస్థల అధినేత సబ్బినేని శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. శ్రీనివాసరావు బాబాయి శివప్రసాద్ ఆర్మీలో ఉద్యోగం చేస్తుండడంతో వారి స్ఫూర్తి దేశభక్తి కలగలిసి నేవీ వైపు అడుగులు వేసినట్లు తెలిపారు. నేవీలో ముంబై, వైజాగ్‌లలో 1985 నుంచి 2000 వరకు ఉన్నతాధికారులు ప్రశంసించేలా దేశభక్తిని చాటుతూ విధులు నిర్వర్తించానని చెప్పారు. ఉత్తమ పౌరులను తీర్చిదిద్ది విద్యార్థి దశలో దేశభక్తి పెంపొందింపచేయాలని తాను ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ఆ ప్రణాళిక ప్రకారం నూజివీడు ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని 2009 మే 6వ తేదీన 420 మంది విద్యార్థులతో ఏడో తరగతి వరకు త్రివిధ విద్యాసంస్థలను ప్రారంభించామన్నారు. 2011- 2 విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిగా విద్యాసంస్థను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నేడు 2500 మంది విద్యార్థులు, 160 మంది సిబ్బందితో పాఠశాల దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. తన సతీమణి ఉదయలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సేవలం దిస్తున్నారన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని విద్యాసంస్థలు కొన సాగిస్తూ విజయాన్ని చవిచూసినట్లు తెలి పారు. అంకిత భావంతోనే దేశ నిర్మాణం సాధ్య మవుతుందన్నారు. మార్కులు, ర్యాంకులు చెప్పుకునేందుకు బా గుంటాయి కాని వాటితో పాటు సమాజ సేవ, పెద్దల పట్ల గౌరవభావం, తల్లి దండ్రులను ఆద రించడం, మానవ సంబంధాలు కొన సాగించడం, దేశభక్తి పెంపొందించడం గొప్ప విజయమన్నారు. క్రీడల అభివృద్ధికి ఎంతగానో ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ కళాశాలను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎంపిసి గ్రూపు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రూపులో 80 మంది విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆలోచనలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యాసంస్థలకు పంపి ఇక తమ బాధ్యత తీరింది అనుకుంటే పొరపాటేనన్నారు. వారి పిల్లల పట్ల తల్లిదండ్రులు పూర్తి శ్రద్ధ వహించాలన్నారు.

సామాజిక సేవకు సంబంధించి ప్రతి అంశంలో తమ విద్యా సంస్థ పాల్గొంటుందని వివరించారు. ప్రతి విద్యార్థికి అన్ని అంశాలను విశదీకరిస్తూ అవగాహన కల్పించడం తమ విద్యా సంస్థ ప్రత్యేకతగా తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పండుగలు నిర్వహించి దేశభక్తి పెంపొందిస్తామన్నారు. ప్రతి పండుగను పాఠశాలలో నిర్వహించి విద్యార్థులకు పండగల పట్ల అవగాహన, పండుగలు ఏర్పడిన తీరు, వాటి ఆంతర్యాన్ని వివరిస్తామన్నారు. పోటీ పరీక్షల్లో సైతం త్రివిధ విద్యార్థులు ముందుంటారన్నారు. అందుకే తమ పూర్వ విద్యార్థులు అన్ని రంగాల్లో స్థిరపడి తమ విద్యా సంస్థ పేరు ప్రఖ్యాతలు నిలబెడుతున్నట్లు వివరించారు. ఇన్ని గొప్ప ఘన విజయాలు తమ విద్యా సంస్థ సొంతం చేసుకున్నందుకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులందరికీ శుభాభినందనలు తెలిపారు.



త్రివిధ విద్యాసంస్థల భవనం

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - లింగపాలెం

పేదలకు పిడికెడు మెతుకులు పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని పాలకులు కుట్ర చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. లింగపాలెం మండలంలోని అయ్యపరాజుగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రదేశాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. పర్యటన సందర్భంగా ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉపాధి పనులు బంద్ చేయాలని ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు అప్పలస్వామి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి పోరాడి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మే 20న ఒక రోజు ఉపాధి హామీ పనులు బంద్ చేసి పేదల గొంతుక ప్రభుత్వాలకు వినిపిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, మేట్లు మధు, ఉషారాణి, అనిత, గోపీ, జ్యోతి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలోని మందలపర్రు, నిడమర్రు, కొల్లేరు, గోపవరం, పెద్ద నింద్రకొలను గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి గవర సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన ఉపాధి హామీ పనులు బంద్ చేసి మండల కేంద్రంలో ధర్నాలో పాల్గొనాలని కార్మికులకు పిలుపునిచ్చారు.



పెదవేగిలో...

ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. మండలంలోని నిడమర్రు, భువనపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం, కార్మిక చట్టాల రక్షణ కోసం 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని. పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేసి సమ్మె వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోక సూరిబాబు, చల్లా రాంబాబు, పిల్లా రాము, గిద్ద నాగు, రాజేష్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి : ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే కార్మిక, ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మూలలంకలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు లేబర్ కోడ్‌లను రద్దు చేసేందుకు సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, నాయకులు జక్కంశెట్టి మేనకలక్ష్మి, బి.పుష్ప, దానమ్మ, జోగి ఏసు, రాజేష్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సమస్యల పరిష్కారం కోరుతు ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు పిలుపునిచ్చారు. యూనియన్ జనరల్ బాడీ సమావేశం పి.రాములమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 20న సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో హైమావతి, సింహాచలం, టి.రాములమ్మ, పి.సులేమాన్, మంగరాజు, మౌలాలి, దుర్గారావు, నూకాలు తాయారు, సుబ్బారావు, నాగరాజు, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

రామారావుకు జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ పరామర్శ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇటీవల గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఎఎంసి మాజీ ఛైర్మన్, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు పారేపల్లి రామారావును ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ పరామర్శించారు. మంగళవారం మండలంలోని బయ్యన్నగూడెంలోని రామారావు నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రామారావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమెతో పాటు జనసేన మండలాధ్యక్షులు తోట రవి, జంగారెడ్డిగూడెం జెడ్‌పిటిసి సభ్యులు పొల్నాటి బాబ్జి, మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి నమూనాలకు టార్గెట్

ప్రజాశక్తి - ఉంగుటూరు

2025-26 సంవత్సరంలో భాగంగా ఉంగుటూరు మండలానికి 1600 మట్టి నమూనాలు టార్గెట్ ఇచ్చారని మండల వ్యవసాయాధికారి డాక్టర్ ఎంఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరించి నేలల స్వభావం, వాటిలో ఉన్న పోషకాల విలువలు తెలుసుకునే విధంగా మట్టి నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తద్వారా రైతులకు నేలల పోషకాల ఆధారంగా ఎరువులు వేసుకునే విధంగా అవకాశం ఉంటుంది. అందులో భాగంగా మంగళవారం ఉంగుటూరులో మట్టి నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌భాషా, భీమడోలు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పి.ఉషారాజకుమారి, రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి : పంటలు పండిస్తున్న రైతులు భూ పరీక్షలు చేయించాలని మండల వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. చాట్రాయి గ్రామంలో మంగళవారం మట్టి నమూనా పరీక్షలు నిర్వహించడానికి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు భూమిలో నత్రజని, భాస్వరం, పంటలు పండే సారం ఉందో లేదో మట్టి నమూనా పరీక్షలు చేయించుకుని తెలుసుకుని లోపాలు ఉంటే రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - చాట్రాయి

బాల్య వివాహాలు చేయొద్దని, అనేక అనర్థాలు వస్తాయని సచివాలయ మహిళా కానిస్టేబుల్ జె.చంద్రకళ అన్నారు. మండల కేంద్రమైన చాట్రాయి గ్రామంలో తహశీల్దార్ కార్యాలయం రోడ్డులో ఉన్న అంగనవాడి కేంద్రంలో మంగళవారం కిశోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.విజయ, సుమలత, జ్యోతి రాణ, జయశ్రీ, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార బోర్డుల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కలిదిండి



తొలగించిన ఫ్లెక్సీలు, కర్రలు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

శివరాత్రి సందర్భంగా కలిదిండి ప్రధాన సెంటర్‌లో, ఆలయానికి వెళ్లే రహదారిలో, రాష్ట్రీయ రహదారిపై ఆర్చ్ ఆకారంలో ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులు అధికారులు మంగళవారం తొలగించారు. ట్రాఫిక్‌కు ఆటంకంగా ప్రచార బోర్డులు శీర్షికన ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తొలగించిన ఫ్లెక్సీలు, కర్రలను ట్రాక్టర్‌పై భోగేశ్వరం ఆలయం వద్దకు తరలించారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - దెందులూరు

బాలల సంరక్షణ అందరి బాధ్యత అని, బాలలను ఇబ్బంది పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ కార్యాలయం ఇన్‌స్టిట్యూషనల్ కేర్ అధికారి సిహెచ్.శ్రీకాంత్ హెచ్చరించారు. లింగపాలెం మండలంలోని కల్రాయిగూడెం గ్రామంలో కిశోర్ వికాస్ 2.0 క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం కిశోర బాలికలకు బాలల రక్షణ, లైంగిక వేధింపులు సంరక్షణ చట్టం-2012 అవగాహన సదస్సులు నిర్వహించారు. శ్రీకాంత్ పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎఎన్ఎం, స్థానిక అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మండవల్లి : బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని వారి హక్కులను పరిరక్షించడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద స్పష్టం చేశారు. కైకలూరు ప్రాజెక్టు పరిధి మండలంలోని లోకముడిలో మంగళవారం నిర్వహించిన కిశోర వికాసం 2.0 కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. కిశోర బాలికలను వివరాలను అడిగి తెలుసుకుని వారి బరువు ఎత్తులను పరిశీలించి పోషకాహారం విధిగా అందించాలని సూచించారు. కైకలూరు స్త్రీ శిశు సంక్షేమ శాఖ కైకలూరు ప్రాజెక్ట్ సిడిపిఒ దీప్తి, సూపర్‌వైజర్లు ఝాన్సీ, నాగలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎఎన్ఎం, ఆశ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికతో ఆర్థిక అభివృద్ధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వార్షిక ప్రణాళికను పక్కాగా సిద్ధం చేయడం ద్వారా ఆర్థిక అభివృద్ధి వేగవంతంగా సాధించవచ్చని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ త్రిపుర సుందరరావు అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో బుక్ కీపర్స్, విలేజ్ ఆర్గనైజర్స్‌కు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో గ్రామైక్య సంఘాల ద్వారా మహిళలు తీసుకున్న రుణాలు, తిరిగి చెల్లించిన రుణాలను ముందుగా బేరిజు వేసుకోవాలన్నారు. గ్రామైక్య సంఘాల్లోని ప్రతి సభ్యురాలు సకాలంలో సక్రమంగా వాటా ధనం చెల్లించే విధంగా చూడాలన్నారు. సంఘాలు స్వయం సమృద్ధి సాధించే దిశగా కుటీర పరిశ్రమల నుండి గొప్ప పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అడుగులు వేయాలన్నారు.

'ఆహ్వాన పత్రికపై పేర్లు ముద్రించాలి'

ముదినేపల్లి : దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలోని ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు సంబంధించి మండల స్థాయి ప్రజాప్రతినిధుల పేర్లు ముద్రించాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మొట్రూ ఏసుబాబు కోరారు. మంగళవారం ముదినేపల్లిలో ఏసుబాబు మాట్లాడుతూ దేశంలోని రెండో చిన్న పూరీగా ప్రసిద్ధిగాంచిన వడాలి శ్రీ జగన్నాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాకు సంబంధించిన ఆహ్వాన పత్రికపై ఎంపీ, ఎంఎల్ఎ, ఎంఎల్‌సి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, దేవదాయ శాఖ అధికారుల పేర్లు ముద్రించినప్పటికీ ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వడాలి గ్రామానికి చెందిన జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గ్రామ సర్పంచి మరీదు దుర్గాశ్రీ, ఎంపిటిసి సభ్యులు పల్లి శ్రీదేవి పేర్లు ముద్రించకపోవడం దారుణమన్నారు. వీరంతా వైసిపి చెందిన ప్రజా ప్రతినిధులు కావడమే ఆహ్వాన పత్రికలో పేర్లు ముద్రించకపోవడానికి కారణమన్న అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ఇకముందు జరిగే ఉత్సవాల్లో ఇలాంటి పొరపాట్లకు తావు లేకుండా పార్టీలకు అతీతంగా మండల ప్రజా ప్రతినిధుల పేర్లను ముద్రించాలన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి టిడిపి గ్రామ అధ్యక్షుడు మృతి

మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించిన చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం అమ్మపాలెం పెట్రోల్ బంక్ సమీపంలో సర్వీసు రహదారిపై ట్రాక్టర్ బోల్తా పడి భోగాపురం గ్రామానికి చెందిన టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు మట్టా నాగరాజు (36) మంగళవారం మృతి చెందారు. వరిగడ్డి కోసం భోగాపురం నుంచి దుగ్గిరాల వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తక్షణమే మృతుడు నాగరాజు స్వగ్రామం భోగాపురం చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. నాగరాజు మృతి ఎంతో బాధాకరమన్నారు. నాగరాజు కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. వారి కుటుంబానికి ప్రభుత్వం తరపున, తెలుగుదేశం పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం నాగరాజు మృతదేహంపై తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి నివాళులర్పించి అనంతరం జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో సైతం నాగరాజు పాడేను మోశారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ప్రతి విషయంలోనూ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే వస్తున్నారు. అందులో భాగంగానే ఎఆర్ విభాగంలోనూ జిల్లా పోలీస్ కార్యాలయంలోనూ గార్డు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వేసవి తాపం నుంచి విముక్తి పొందేందుకు ప్రతి ఒక్క గార్డుకు కూలర్‌ను ఏర్పాటు చేయాలని నూతన నిర్వచనం చేశారు. అనుకున్నది తడవుగా 13 గార్డ్ పాయింట్లలో 13 కూలర్లను ఖరీదు చేశారు. వాటిని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మంగళవారం సాయంత్రం ఆయా పాయింట్లలో గార్డు విధులు నిర్వహిస్తున్న వారికి అందించారు. మొత్తం 13 కూలర్లు రూ.91 వేలతో కొనుగోలు చేసి వారికి అందించామని ఎస్‌పి తెలిపారు.